
పుష్పగుచ్ఛాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు


నగరంలో విక్రయానికి సిద్ధం చేసిన మొక్కలు


సర్పవరం రోడ్డులోని జ్యూయల్ మెడోస్‌లో చిన్నారుల జోష్

ఉజ్వల ఉదయానికి స్వాగతం

న్యూ ఇయర్ వస్తోందంటే అందరికీ పండుగే. చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకు ఎన్నో ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టే ముందు ఏడాది పొడవునా ఉన్న బాధలను మర్చిపోయి సరదాగా గడుపుతుంటారు. న్యూ ఇయర్ వేడుకల్లో ప్రధానంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. నగర పరిధిలోనే కాకుండా రూరల్ పరిధిలో సర్పవరం పూలమార్కెట్‌కు ప్రసిద్ధి కావడంతో మంగళవారం పూలమార్కెట్ రద్దీగా కనిపించింది. పలువురు ఆర్డర్లపై బొకేలు, పూలమాలలను తీసుకువెళ్లారు. న్యూ ఇయర్ వేడుకల్లో 31 రాత్రి అంటే మందు, మాంసాహార ప్రియులకు ఎంతో ఉత్సాహం.

- వ్యాపారులకు ముందస్తు పండగ
- కిక్కిరిసిన స్వీటు, కేక్ షాపులు
- పండ్లు కొనుగోలు చేసుకున్న ప్రజలు

బోట్‌క్లబ్: నూతన సంవత్సర వేడుకలకు ప్రజలు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. స్వీట్లు, కేక్‌లు, ముగ్గులు కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. స్థానిక నాగమల్లితోట జంక్షన్, భానుగుడి, బాలాజీచెరువుసెంటర్, అశోక్‌నగర్, గాంధీనగర్, రామారావుపేట, పెద్దమార్కెట్, జగన్నాథపురంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక షాపులు వెలిశాయి. నగరంలో ఏ వీధిలో చూసినా నూతన ఇయర్ హడావిడి కనిపించింది. వీటితో పాటు బిర్యానీ, న్యూడిల్స్ వంటి విక్రయించే షాపులు కూడా అధికంగా వెలిశాయి. వినియోగదారులను ఆకట్టుకొనేందుకు పలువురు వ్యాపారాలు బిర్యానీ కొన్నవారికి కూల్ డ్రింక్స్‌తోపాటు పలు ఆహార పదార్థాలు ఆఫర్లు పెట్టి మరీ విక్రయించారు.

జోరుగా రంగుల విక్రయాలు

ఇళ్లు, దుకాణాల ముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు రంగులతో ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు ఆసక్తి చూపారు.

గ్రీటింగ్ కార్డులకు కాలం చెల్లు

ఒకప్పుడు న్యూ ఇయర్ వస్తోందంటే గ్రీటింగ్ కార్డులు ప్రధాన భూమిక పోషించేవి. కొందరు ముందుగానే తమకు కావాల్సిన విధంగా ఆర్డర్ పెట్టి గ్రీటింగ్ కార్డులు కొనుగోలు చేసి మిత్రులకు , అధికారులకు పంపేవారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అలాగే పూల మొక్కలను బహుమతులుగా అందించేందుకు సైతం కొనుగోళ్లు సాగుతున్నాయి.

మొక్కలకు క్రేజ్

ఇంటిలో పెంచుకునే మొక్కలను తమ మిత్రులకు, బంధువులకు, అధికారులకు ఇచ్చేందుకు, ఆక్సిజన్ ఎక్కువగా ఇచ్చే మొక్కలను, ఔషధ గుణాలున్న మొక్కలను ఇచ్చేందుకు పలువురు వాటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి డిమాండ్ ఎక్కువగా ఉంది. నగరంలో సుమారు 50కి పైగా మొక్కలు విక్రయించే తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు.

రూరల్‌లో సందడే సందడి..

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం, రమణయ్యపేట, వాకలపూడి, హార్బర్ పరిధిలోని బిర్యానీ పాయింట్ల వద్ద రద్దీ నెలకొంది. ఎస్వీ రంగారావు విగ్రహం సమీపంలోని ఒక పలావు సెంటర్ వద్ద బిర్యానీ పార్శిల్స్ కోసం మాంసాహార ప్రియులు బారులు తీరారు. మద్యం దుకాణాల వద్ద మందుబాబుల సందడి కనిపించింది. ఇండ్ల వద్ద మహిళలు, యువతులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు రంగురంగులతో స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు.

సర్పవరం జంక్షన్‌లో..

సర్పవరం జంక్షన్ వద్ద ఖాళీ స్థలంలో మంగళవారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. వేడుకల్లో ఆటపాటలతో సందడి చేస్తూ న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. పలు అపార్టుమెంట్ల వద్ద న్యూ ఇయర్ వేడుక సందడి చేశాయి. చిన్నారులు డ్యాన్స్‌లతో అదరగొట్టారు. సర్పవరం మార్గంలోని జ్యూయల్ మెడోస్‌లో అపార్టుమెంట్ వాసులు న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా యువతులు, చిన్నారులు డ్యాన్స్‌లతో సందడి చేశారు.


సర్పవరం పూల మార్కెట్ వద్ద న్యూ ఇయర్ వేడుకల కోసం సిద్ధం చేసిన పుష్పగుచ్ఛాలు

వ్యాపారం బాగుంది



గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పళ్ల విక్రయాలు బాగానే ఉన్నాయి. వ్యాపారం ఉదయం తక్కువగా సాగినా, సాయంత్రానికి క్రమేపీ పెరిగింది. నూతన సంవత్సరం కోసం అధికంగా నిల్వ పెట్టుకున్నాం. యాపిల్, కమలా, దానిమ్మ పండ్లు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

– బాలకృష్ణ, పండ్లు వ్యాపారి

క్లుప్తంగా

స్థానికులకు ఉపాధి కల్పించాలి


కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన చట్టం ప్రకారం స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న హసన్ షరీఫ్, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని ప్రైవేటు కంపెనీలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని, ఒక వేళ కంపెనీ స్థాయికి ఉద్యోగి నైపుణ్యం లేకపోతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నైపుణ్యం కలిగించి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వం తరఫున ఒక ఏజెన్సీ పరీక్షిస్తూ ఉండాలని, ఎన్‌ఓసీ ఇవ్వడానికి అనుమతికి ముందు ఈ ఏజెన్సీ నుంచి సమాచారం తీసుకుని ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాన్ని అధికారులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ఆర్య వికలాంగుల సమైఖ్య అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అభినందన సభ


పదవీ విరమణ చేసిన డ్రైవర్ కొండయ్యను సత్కరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: కాకినాడ డిపోలో పదవీ విరమణ చేసిన డ్రైవర్ వి.కొండయ్యకు అధికారులు, యూనియన్ నాయకులు మంగళవారం అభినందన సభ నిర్వహించారు. కొండయ్య 1997 నుంచి డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కొండయ్యను డిపో మేనేజర్ సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఇంజినీర్ కె.ప్రభాకర్, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

బాలాజీచెరువు: కొండయ్యపాలెం ప్రాంతానికి చెందిన వీధి వ్యాపారి నాగేశ్వరరావుకు యంగ్ మైండ్ సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకట రమణ మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామకృష్ణ, బుజ్జి, కిరణ్, వీర సత్య పాల్గొన్నారు.

పండ్లు, దుప్పట్ల పంపిణీ

కరప: మండలం నడకుదురులోని జనావళి వృద్ధుల అనాథాశ్రమంలో మంగళవారం యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ ఆధ్వర్యంలో వృద్ధులతో కల్సి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్‌మైండ్స్ సంస్థ తరఫున వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందజేశారు. యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భానుమతి, డాక్టర్ బాబ్జీ దంపతులు

కరప: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో సవిలే ఫౌండేషన్ రూపొందించిన 2025 న్యూ ఇయర్ కేలెండర్‌ను లైఫ్‌లైన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కోరుకొండ భానుమతి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ దంపతులు మంగళవారం ఆవిష్కరించారు. కేలెండర్‌ను రూపొందించిన దళిత రచయిత, అంబేడ్కరిస్ట్ సవిలే రాజేష్‌ను వారు అభినందించారు.

బలరామునిగా వేంకటేశ్వరుడు



కాకినాడ రూరల్: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సర్పవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మంగళవారం భక్తులకు బలరాముని అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

‘తితీక్ష’తో వన్నె తెచ్చారు


తితీక్ష బృందాన్ని అభినందిస్తున్న నిర్వాహకులు

- జాతీయ స్థాయిలో మొదటి స్థానం పొందిన నాటిక బృందానికి ఘన సత్కారం

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): తిరుపతిలో నిర్వహించిన జాతీయ స్థాయి సుబ్బరాజు నాట్య కళా పరిషత్ పోటీల్లో కాకినాడ కళాకారులు ప్రదర్శించిన తితీక్ష నాటిక మొదటి బహుమతిని కైవసం చేసుకోవడం కాకినాడకు వన్నె తీసుకురావడమేనని సీనియర్ రంగస్థల నటుడు సీఎస్ మూర్తి అన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నాటక బృందాన్ని వారు సత్కరించారు. ఏడెనిమిది ఏళ్ల క్రితం నంది నాటకోత్సవాల్లో మొదటి స్థానం సాధించామని మళ్లీ ఇన్నాళ్లకు ఈ ఘనత సాధించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. సీతారామరాజు కళావేదిక కార్యదర్శి పంపన దయానందబాబు విజయం సాధించిన దర్శకులకు సాంకేతిక నిపుణులకు నటీనటులకు అభినందనలు తెలిపారు. నాటక దర్శకుడు బీవీకే వినయ్ మాట్లాడుతూ ఉత్తమ ప్రదర్శనతో పాటు ఉత్తమ సంగీతం, దర్శకత్వం రంగాలంకరణ, ఉత్తమ మేకప్‌లను కూడా తమ నాటిక గెలుచుకుందన్నారు. గంజాయి వల్ల చితికిపోయిన కుటుంబ నేపథ్యంలో సాగిన నాటికను పరిషత్ సభ్యులు ఎంతో మెచ్చుకున్నారన్నారు. అనంతరం నటీ, నటులు, సాంకేతిక నిపుణులు రమణ, తిరుమలరావు, బాబురావు, సత్యనారాయణ, మెహర్ ప్రసాద్, పుల్లారావు, శ్రీను, దర్శకుడు వినయ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బుర్రా పద్మనాభం, ప్రసాద్, వెంకన్నబాబు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.


తిరుపతిలో మొదటి బహుమతి అందుకుంటున్న నాటిక బృందం

పాఠశాల అభివృద్ధిలో ఎస్‌ఎంసీల పాత్ర కీలకం


ఎస్‌ఎంసీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్‌ఎంసీ) పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ అన్నారు. కాకినాడ అర్బన్ మండలంలో మండల స్థాయి పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం సాలిపేట బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థుల ఉన్నతికి కమిటీలు పని చేయాలని కోరారు. శిక్షణకు సంబంధించి ప్రత్యేకంగా ముద్రించిన కరదీపికలను వారికి అందజేశారు. జనవరి 4న పాఠశాల స్థాయిలో కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, అర్బన్ ఎంఈఓ సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

93.3 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలో మంగళవారం సాయంత్రానికి 93.3 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో పింఛన్‌దారులు 11,338 మంది ఉండగా రూ 4,79,55,000 లు ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,578 మంది లబ్ధిదారులకు రూ 4,45,50,000 గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ ఇచ్చారన్నారు.

సర్పవరం పరిధిలో 11 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

కాకినాడ రూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై సర్పవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల మేరకు మొత్తం 11 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జేఎస్‌సీఎం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వి.నరసింహరావు ముగ్గురికి రెండు రోజులు చొప్పున జైలు, 8 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారన్నారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



వాకలపూడి హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు


బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో నాయకులు, ఉపాధ్యాయులు


గురజనాపల్లి సైన్స్‌ఫెయిర్‌లో ప్రయోగాలను పరిశీలిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కరప: మండలం గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ప్రారంభించారు. 9 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలల నుంచి స్టూడెంట్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్ట్, స్టూడెంట్ గ్రూపు ప్రాజెక్టు మూడు విభాగాలుగా ఈ ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వై.వీరవేణి, పెంకే సత్తిబాబు, ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ, హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, ఎస్‌ఎంసీ చైర్మన్ పి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

కాకినాడ రూరల్: వాకలపూడి హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విద్యాశాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. మండలంలోని 18 ప్రభుత్వ, 55 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 8 అంశాలలో సుమారు 200 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఒక్కో అంశానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలుగా 24 ప్రదర్శనలను ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ శ్రీరామాంజనేయులు, ఎంఈఓలు వేణుగోపాల్, ఏసుదాసు హాజరయ్యారు. విజేతలకు కోరమాండల్ సంస్థ సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రసాద వితరణ

బోట్‌క్లబ్: వాసవీ వైశ్య ఫ్రెండ్స్ కన్వీనర్ చెక్కా రమేష్ ఆధ్వర్యంలో స్థానిక వార్ఫు రోడ్డులోని వాసవి కన్యాకా పరమేశ్వరి సత్రంలో మంగళవారం ధనుర్మాస ప్రసాద వితరణ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా కృష్ణమోహన్ ప్రసాదం పంపిణీ ప్రారంభించారు.


ప్రసాదం పంపిణీ చేస్తున్న వాసవీ సభ్యులు

శ్రీరామునిగా సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి మంగళవారం శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

